క్లుప్తంగా

రాజీవ్ గృహకల్ప అభివృద్ధి కమిటీ ఎన్నిక



కాజీపేట అర్బన్ : మండలంలోని కడిపికొండ రాజీవ్ గృహకల్ప అభివృద్ధి కమిటీని కాలనీ వాసులు ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శనిగరం సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా బుట్ట మేకల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా పంకెర్ల కుమారస్వామి, కోశాధికారిగా కూర్కు శరత్, సహాయ కోశాధికారిగా పప్పుల గోవర్ధన్, ప్రచార కార్యదర్శిగా దిండిగల కైలాసంతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని కాంగ్రెస్ నాయకులు నర్మెట వెంకటరమణగౌడ్, గంగుల శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, శ్రీనివాసరెడ్డి, నగేష్ తదితరులు సన్మానించి అభినందించారు.

క్రికెట్ పోటీలను తిలకించిన మేయర్, ఎమ్మెల్యే



వరంగల్ అర్బన్ : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జీడబ్ల్యూఎంసీ సిబ్బందికి 2వ డివిజన్ రెడ్డిపురంలో క్రీడలు కొనసాగుతున్నాయి. ఆదివారం బల్దియా మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు క్రీడాకారులతో మమేకమై మ్యాచ్‌ను తిలకించారు. ఎమ్మెల్యే బ్యాట్‌తో బంతులను బౌండరీలకు తరలించి అందరిని ఆశ్చర్యపర్చారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఖిలా వరంగల్ : వరంగల్ 38వ డివిజన్ పడమట కోటలో గద్దెల కుమారస్వామి ఆధ్వర్యంలో లక్ష డప్పుల వెయ్యిల గొంతుకల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్ హాజరై ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పుల వెయ్యి గొంతుల కార్యక్రమం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. మాజీ కార్పొరేటర్ దామోదర్ యాదవ్, పోలెపాక యాదగిరి, ప్రసాద్, లింగాల ఇమ్మానియేల్, కుమారస్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. రాంనగర్, పోలీసు హెడ్‌క్వార్టర్స్, గోకుల్‌నగర్, స్కాలర్ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైభవంగా వేమన జయంతి



హన్మకొండ : హనుమకొండ టీఎన్జీవోస్ కాలనీ-2లో ఆదివారం త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీ వేమన భగవాన్ జయంతి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎన్జీవోస్ కాలనీ, శ్యామల గార్డెన్స్, ఎన్జీవోస్ కాలనీ-1 పురవీధుల గుండా వేమన భగవాన్‌ను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సిరింగి సునీల్ కుమార్, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి-ఇందూ జ్ఞానవేదిక జమ్మికుంట కమిటీ అధ్యక్షుడు వెంకటాచార్యులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుధీర్



హసన్‌పర్తి : కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగమళ్ల సుధీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం కిట్స్ కళాశాల మైదానంలో జరిగాయి. ఉపాధ్యక్షులుగా బొక్క కుమార్, కోమళ్ల రాజేశ్వర్‌రెడ్డి, కరట్లపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గుండమీది విజయ్‌మోహన్, కోశాధికారిగా గూడూరు లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా యాదగిరి, అజ్మీరా గణేష్, సుదర్శన్, గౌరవ అధ్యక్షుడిగా పావుశెట్టి శ్రీధర్, ముఖ్య సలహాదారులుగా బోడ యుగంధర్, ఆకుల సదానందం, నూ రయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్లాట్లుగా పంట పొలాలు

- గ్రేటర్‌లో పెరిగిన రియల్ బూమ్
- వ్యవసాయ భూముల్లో వెలుస్తున్న వెంచర్లు



మడికొండ శివారులో ప్లాట్లుగా మారిన వ్యవసాయ భూములు



మడికొండ శివారులో నూతనంగా వెలుస్తున్న వెంచర్

మడికొండ : హనుమకొండ మండలంలోని శివారు గ్రామాల్లో పంటపొలాలు కాస్తా వెంచర్లుగా మారుతున్నాయి. వ్యవసాయ భూములు ఉన్న రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా మారుస్తున్నారు. వ్యవసాయ భూములను ప్లాట్లుగా చేస్తు లే జౌట్ చేసినట్లు చూపిస్తూ, మధ్య తరగతి ప్రజలకు ఆశ పెడుతున్నారు. అధికారులు సైతం మిన్నకుండి చూస్తూ సామాన్య ప్రజలు కొనుగోలు చేశాక అనుమతుల కోసం వెళ్తే లే జౌట్ లేదని చెబుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రియల్టర్లు ఇచ్చే మామూళ్ల మత్తులోజోగుతున్నారని ఆరోపిస్తున్నారు.

నగర శివారు గ్రామాల్లో వెంచర్లు

నగరం విస్తీర్ణం పెరగడంతో శివారు గ్రామాలైన మడికొండ, రాంపూర్, కడిపికొండ, భట్టుపల్లి, మామునూర్, తిమ్మాపూర్, నక్కలపల్లి, ధర్మసాగర్ తదితర గ్రామాల్లో ఎక్కువగా వెంచర్లు చేయడానికి రియల్టర్లు ముందుకు వస్తున్నారన్నారు. ఈ గ్రామాల్లో ఎకరాకు సుమారు రూ.కోటి నుంచి రూ.2కోట్ల వరకు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారని స్థానికులు తెలిపారు. కొంతమంది రియల్టర్లు వ్యవసాయ భూములను కొనుగో చేసి పక్కన ఉన్న రైతులకు దారి లేకుండా చేస్తూ వారి భూములను సైతం అమ్మేవిధంగా చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీడు భూముల పక్కన సాగు చేసుకునే రైతులు పక్క పొలంలోకి జరుగుతూ హద్దురాళ్లను తొలగించి ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

రియల్టర్లకు వరంగా బీడు భూములు

నగర శివారు గ్రామాల్లో ఉన్న పంట పొలాలు రియల్టర్లకు వరంగా మారుతున్నాయి. పట్టా బుక్‌లు లేకున్నా మేము చేయించుకుంటామని రైతులకు భరోసా ఇస్తూ పట్టా ఖర్చు డబ్బులను వసూలు చేసుకుంటున్నారు. రియల్టర్‌లు వ్యవసాయం చేయకుండా బీడుగా ఉన్న భూములపై కన్నేసి కొనుగోలు చేస్తు ఎంతో కొంత ధరకు కొంటున్నారు. వ్యవసాయంపై ఇష్టం లేని రైతులను ఎంపిక చేసుకుని ఒకటికి పది సార్లు రైతుల ఇంటి చుట్టు ప్రదక్షిణలు చేస్తూ వారిని బోల్తా కొట్టిస్తున్నారు. కొన్నేళ్ల నుంచి ఉన్న బాటలను కబ్జా చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇలాంటి వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

సాదాబైనామాలో అవకాశం ఇస్తే లాభం

సాదాబైనామాలో విలీన గ్రామాల భూములకు అవకాశం కల్పిస్తే రైతులకు కొంత లాభం జరుగుతుందని ప్రజలు వాపోతున్నారు. భూముల ధరలు పెరగడంతో ఎవరు కాస్తులో ఉంటున్నారో తెలియడం లేదన్నారు. మడికొండ శివారు ఎల్లమ్మ దేవాలయం వద్ద నూతనంగా వెలుస్తున్న వెంచర్‌లో రోడ్లు వేయడానికి పనులు చేస్తున్నారు. వెంచర్ వెంబడి మడికొండ పెద్ద చెరువు మత్తడి పడితే బయటకు వచ్చే నీరు మొత్తం కాల్వలో నుంచి సోమిడి చెరువులోకి వెళ్తుండేది. ప్రస్తుతం వెంచర్‌తో మత్తడి నీరు రైతుల పొలాల మీదుగా వెళ్లే విధంగా ఉందని ప లువురు రైతులు ఆరోపిస్తున్నారు.

కార్పొరేట్లకు తొత్తుగా బీజేపీ

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేశ్



సదస్సులో మాట్లాడుతున్న రమేశ్

న్యూశాయంపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు తొత్తుగా వ్యవహరిస్తూ కార్మికవర్గం, రైతాంగంపై దాడిని తీవ్రం చేసిందని దీనిని ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండలోని సుందరయ్యభవన్‌లో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక, కర్షక ఐక్యతా దినోత్సవ జిల్లా సదస్సు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన జరిగింది. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన రమేశ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెట్టి కార్మికులు, రైతాంగం, పేదల బ్రతుకులను నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు మాట్లాడారు. సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య, ఆఫీస్ బేరర్స్ ప్రభాకర్‌రెడ్డి, బొట్ల చక్రపాణి, మెట్టు రవి, పుల్ల అశోక్, ఎస్.రజిత, బి.మహేష్, పెండ్యాల రవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భిక్షపతి, చంద్రమౌళి, అ జీమా, పద్మ, నాగరాజు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఎన్నిక



సుధాకర్, అధ్యక్షుడు



రాజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి

హన్మకొండ : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్-143 హనుమకొండ జిల్లా నూతన కమిటీని నియమించారు. ఆదివారం కమిటీని యూనియన్ రాష్ట్ర కోశాధికారి, ఎన్నికల అధికారి యోగానంద్ ప్రకటించారు. అధ్యక్షుడిగా మస్కపురి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా అర్షం రాజ్‌కుమార్, కోశాధికారిగా పొగాకుల ప్రభాకర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా గోకారపు శ్యామ్ కుమార్, బొడిగే శ్రీనివాస్, బి.కర్నాకర్, దుంపల పవన్, దేవేందర్, ప్రశాంత్, ఎస్.సదానందం, కే.రంజిత్, సంయుక్త కార్యదర్శులుగా బి.రాజేందర్, మైదం సుధాకర్, జె.శ్రీనివాస్, బి.ధన్‌రెడ్డి, ఆదర్శ్ కుమార్, శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా సూర్యప్రకాశ్, రంజిత్, రాంబాబు, చేతి శ్రీనివాస్, రాజు, నరేందర్‌ను నియమించినట్లు ప్రకటించారు.

పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

- జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాంనర్సింహాచార్యులు



రాంనర్సింహాచార్యులును సత్కరిస్తున్న పెన్షనర్లు

హసన్‌పర్తి : పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సముద్రాల రాంనర్సింహాచార్యులు కోరారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భీమారం యూనిట్ సమావేశం ఆదివారం జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి రాంనర్సింహాచార్యులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ ఈహెచ్ఎస్ సెంటర్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆయా విభాగాలకు చెందిన వైద్యనిపుణులు లేకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లు సుధాకర్, శోభ, సమ్మిరెడ్డి, కమల, సూర్యప్రకాష్‌లతో పాటు ముఖ్యఅతిథిని శాలువలతో ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీరన్న, అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రబెల్లి కమలాకర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు శంకర్‌రావు, రఘుపతి, వెంకన్న, సదానందం, వనజా,కమల తదివతరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు భవిష్యత్

మామునూరు : ఫార్మసీ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్ అందుకుంటారని వాగ్దేవి విద్యాసంస్థల కార్యదర్శి కరస్పాండెంట్ సీహెచ్.దేవేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం వరంగల్ బొల్లికుంట వాగ్దేవి కలాశాలలో జేఎన్టీయూ, కేయూ అనుబంధ ఫార్మసీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఉత్తమ ఫార్మసీ విద్యార్థులకు దేవేందర్‌రెడ్డి ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జి.కమల్‌యాదవ్, డాక్టర్ ఎం రాధాకిషన్, సిహెచ్.వాహిని, శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డంపింగ్ యార్డు పొగతో తీవ్ర ఇబ్బందులు



మడికొండ: మడికొండ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుతో మడికొండ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కొన్నేళ్లుగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మడికొండ, రాంపూర్, ఎల్కతుర్తి గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ముందుగా గ్రామస్తుల నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. ముందుగా ఒక కార్యాచరణ రూపొందించి ఒక అడ్‌హాక్ కమిటీని వే సుకొని ముందుకు వెళ్తామని ప్రజలు పేర్కొన్నారు. త్వరలోనే ఒక కమిటీని ఎస్‌డీఎల్‌సీ రిటైర్డ్ ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టు స్వామి నేతృత్వంలో గ్రామాలకు చెందిన కొంతమంది పేర్లను నమోదు చేశారు. వరంగల్ ఫోరం ఫర్ బెటర్ నుంచి పొల్లూరి సుధాకర్ పాల్గొని మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో తీవ్రమైన సమస్య ఉందన్నారు. నాణ్యతను పరీక్షించి గాలి కాలుష్యంపై ప్రతీ రోజు రిపోర్టు చేయాలన్నారు.

అలరించిన 'కరొకే'

హన్మకొండ: నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాలలో నిర్వహించిన 'కరొకే' కార్యక్రమం ఆహుతులను, సంగీత ప్రియులను అలరించింది. ఏకశిల కరొకే క్లబ్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గాయకులు పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ రవి మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే వారికి ఇలాంటి కార్యక్రమాలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఏకశిల కరొకే క్లబ్ ఏర్పాటు చేసి గాయకులను ప్రోత్సహిస్తున్న వ్యవస్థాపకులు కె.రాజ్‌కుమార్, పి.విజయ్ కుమార్, ఎస్.రేవతి, కె.సుధను ఆయన అభినందించారు. రాష్ట్ర కవుల సంక్షేమ సంఘం బాధ్యులు సిరాజుద్దీన్, రవికుమార్, విద్యాసాగర్ రావు కళాకారులను అభినందించారు. ఉమ్మడి వరంగల్, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల కళాకారులు పాల్గొని తమ పాటలతో అలరించారు.

ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి



ఖిలా వరంగల్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కార్మిక కర్షక ఐక్యత దినోత్సవం సందర్భంగా ఆదివారం వరంగల్ ఉర్సుగుట్ట సీఐటీయూ కార్యాలయంలో అఖిల భారత రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సాగర్ అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది.

నిషేధిత గుట్కాల స్వాధీనం

మడికొండ : నిషేధిత పొగాకు గుట్కాలను అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ నిమిత్తం మడికొండ ఇండస్ట్రీయల్ ఏరియాలో వెళ్లగా అక్కడ ఉన్న కిరాణం షాపుల్లో తనిఖీ చేయగా రాజస్థాన్‌కు చెందిన మనోజ్‌కుమార్ షాపులో రూ.2,660, పప్పరామ్ షాపులో రూ.2,300 విలువ గల నిషేధిత గు ట్కాలు లభించినట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిషన్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సీపీఎం పోరాటం

కాజీపేట అర్బన్ : ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఎం మరో పోరాటానికి సిద్ధంగా ఉందని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.చుక్కయ్య తెలిపారు. న్యూశాయంపేట సుర్జీత్‌నగర్‌లో ఆది వారం సుర్జీత్‌నగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు కారు ఉపేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీపీఎం శాఖ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌కు మద్దతు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్, నల్గొడ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌కు తెలంగాణా ఆర్ట్, ఫిజికల్ వర్క్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కలువల కమలాకర్ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. రవీందర్ మాట్లాడుతూ సమగ్రశిక్ష పథకంలో భాగంగా పనిచేస్తున్న ఆర్ట్ క్రాఫ్ట్ టీచర్ల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు.

పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి

- రాష్ట్ర అధ్యక్షుడు రామమనోహర్



మాట్లాడుతున్న రామమనోహర్

వరంగల్ : రాష్ట్రంలోని పెన్షనరీ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రాష్ట్ర గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెలిశోజు రామమనోహర్ డిమాండ్ చేశారు. ఆదివారం కాశిబుగ్గ యూనిట్‌శాఖ సమావేశం అధ్యక్షుడు తమ్మ వీరయ్య అధ్యక్షతన సరస్వతీ విద్యానికేతన్‌లో జరిగింది. వక్తలు మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్, ఇన్‌కమ్ ట్యాక్స్ విషయంలో హనుమకొండలోని బ్లూ చిప్ సంస్థ ఉచితంగా సేవలు అందిస్తున్నారన్నారు. అట్టి సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె.సుధీర్‌బాబు, యస్.సదానందం, రాజయ్య, కుమారస్వామి, మ దార్‌సాహెబ్, మధుసూదన్‌రావు, రత్నం, డేని యల్, యాదగిరి, బ్లూ చిప్ హనుమకొండ ప్రతినిధి జి.అశోక్ పాల్గొన్నారు.

దాడి చేసిన దుండగులను శిక్షించాలి

వరంగల్ : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల హెచ్ఎం కంబాలపల్లి రాములుపై దాడికి పాల్పడిన దుండగులను వెంటనే శిక్షించాలని టీపీటీఎఫ్ అధ్యక్షుడు ఊటుకూరి అశోక్, ప్రధానకార్యదర్శి వీరస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాములుపై జరిగిన మూకుమ్మడి దాడిపై జనవరి 12న తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం జరిగిందని అన్నారు. అందులో వివిధ ఉపాధ్యాయ సంఘాలు పాల్గొని దాడులకు పాల్పడ్డ వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి నిరసనగా జనవరి 20న ఉపాధ్యాయులందరూ పాఠశాలలకు నల్లబ్యాడ్జీలు ధరించి హాజరుకావాలని పిలుపునివ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని రాష్ట్రంలోని 23 ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

నయీంనగర్ : అధికారుల పనితీరు, ప్రజల సహకారంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం 53వ డివిజన్ విజయగణపతి, విద్యారణ్యపురి, శంకర్ నగర్ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం నాటికి నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీల్లో వర్షపు నీరు నిలవకుండా చేస్తానన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కంటెస్ట్ కార్పొరేటర్ కావ్య మహేందర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, పల్లె రాహుల్‌రెడ్డి, కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి, రవీందర్, పల్లకొండ సతీష్, రవీందర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష డప్పుల సన్నాహక ప్రదర్శన



డప్పులు కొడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హన్మకొండ చౌరస్తా: వర్గీకరణకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరిని గుండెల్లో దాచుకుంటామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అన్నారు. సోమవారం నిర్వహించే వేల గొంతులు-లక్షడప్పుల సన్నాహక మహా ప్రదర్శనకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి వేలాది డప్పులతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ పెద్దమ్మగడ్డలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా కార్యదర్శి సుంచు రజినికుమార్ మాదిగ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. సుకుమార్ మాట్లాడుతూ ఎస్సీల్లో ఉమ్మడి రిజర్వేషన్ల విధానం అమలుకావడం వలన కేవలం మాలలే అభివృద్ధి చెందారన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య



ఎంజీఎం: ఎంపీ కడియం కావ్యను సన్మానిస్తున్న ఐఎంఏ ప్యానల్ సభ్యులు

విద్యారణ్యపురి : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు. దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం హనుమకొండలో ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్, రాష్ట్ర బాధ్యులు నున్న నర్సమ్మ, బోనగిరి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లపు రెడ్డి వాసుదేవరెడ్డి, బాధ్యులు పాల్గొన్నారు.

ఎంపీ కావ్యను కలిసిన ఐఎంఏ బాధ్యులు

ఎంజీఎం : ఇటీవల నూతనంగా నియమితులైన వరంగల్ జిల్లా ఐఎంఏ ప్యానల్ బాధ్యులు, అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ ఎంపీ కడియం కావ్యను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి శాలువాతో సత్కరించారు. ఎంపీ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం కలిసికట్టుగా ఉండడానికి ఐఎంఏకి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో కార్యదర్శి డాక్టర్ అజిత్ మహ్మద్, కోశాధికారి శిరీష్‌కుమార్, వరంగల్ జిల్లా తానా (తెలంగాణ హాస్పిటల్స్- నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్) అధ్యక్షుడు దిలీప్ కుమార్, ఐఎంఏ ప్రెసిడెంట్ మన్మోహన్ రాజ్, టీజీఎంసీ సభ్యులు, ఐఎంఏ జిల్లా ఉపాధ్యక్షులు, వరంగల్ తానా కోశాధికారి నరేష్ కుమార్, దివిజ ఉన్నారు.

అమ్మవారి సన్నిధిలో ఎంపీ

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయాన్ని ఆదివారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శేష భారతి, అర్చకులు ఎంపీని ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. అమ్మవారికి పూజలు నిర్వహించుకున్న అనంతరం ఎంపీ కావ్యకు అర్చకులు తీర్థప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మామునూరు : వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై లారీ, కారును ఢీకొట్టడంతో డ్రైవర్ స్వల్పగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి మామునూరు టీజీఎస్పీ బెటాలియన్ ప్రధాన గేటు వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి హనుమకొండకు ఓ వ్యక్తి కారులో బయల్దేరాడు. మామునూరు బెటాలియన్ ప్రధాన గేటు ఎదురుగా కారు రాగా ఎదురుగా వచ్చే లారీ కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయినప్పటికీ బెలూన్ ఓపెన్ కావడంతో డ్రైవర్‌కు స్వల్పగాయాయ్యాయి. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

కార్మికుల జీవితాలు మార్చేందుకే సొసైటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్ భాస్కర్

హన్మకొండ : ఆటో కార్మికుల జీవితాలను మార్చేందుకే త్రిచక్ర పొదుపు పరస్పర సహాయ సహకార సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సొసైటీ నాల్గవ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ముందుగా దాస్యం సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు ఈసంపల్లి సంజీవ, కార్యదర్శి మంద శ్రీధర్ రెడ్డి వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. సమావేశంలో వినయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కేసీఆర్ సహకార సంఘాలను బలోపేతం చేశారన్నారు. ఆటో కార్మికులను కు టుంబ సభ్యులుగా భావించి తాను తన ఎమ్మెల్యే జీతం రూ.9.90 లక్షలు త్రిచక్ర పొదుపు, పరస్పర సహాయ సహకార సంఘాన్ని ఆర్థికసాయంగా అందించానన్నారు. ఈ సందర్భంగా చనిపోయిన సభ్యులకు మంజూరైన బీమాక్లెయిమ్‌లను ముగ్గురు సభ్యులకు రూ.1 లక్ష చొప్పున చెక్కులు అందించారు. కాకతీయ కో ఆపరేటివ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ యాకుబ్ నాయక్, రాజయ్య, త్రిచక్ర సహకార సంఘం కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, కుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.